

చన్నపట్టణ కాంగ్రెస్ అభ్యర్థి సీపీ యోగేశ్వర్ నామినేషన్‌లో సీఎం, డీసీఎం

యోగేశ్వర్‌దే గెలుపు: సీఎం

● భారీ ర్యాలీలో పాల్గొన్న సీఎం, డీసీఎం

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చన్నపట్టణ నియోజకవర్గంలో యోగేశ్వర్‌దే గెలుపు అని సీఎం సిద్దరామయ్య భరోసా ఇచ్చారు. గురువారం చన్నపట్టణలో యోగేశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేలాదిమందితో కలసి వచ్చి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. అనంతరం బహిరంగసభలో సీఎం మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి ఎవరనేది ముఖ్యం కాదని, యోగేశ్వర్ కాంగ్రెస్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారన్నారు. బీజేపీ, ఎన్డీయే నుంచి అతడికి అన్యాయం జరిగిందని మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారన్నారు. కాంగ్రెస్ తరఫున సాదరంగా స్వాగతించామని, ఆయన విజయానికి కలసి పనిచేస్తామన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ చన్నపట్టణ నుంచి రెండుసార్లు గెలిచిన కుమారస్వామి నియోజకవర్గానికి చేసిన సేవలు ఏమిటో బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శుభముహూర్తంలో యోగేశ్వర్ పార్టీలో చేరారన్నారు. ఆయన గెలుపుకోసం శాయశక్తులా కలసి పనిచేస్తామని, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. చన్నపట్టణకు 500 కోట్ల రూపాయల గ్రాంటు కేటాయించామన్నారు.

మూడు స్థానాలకు అభ్యర్థుల ఖరారు

మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలకు కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్ పార్టీలకు అభ్యర్థులు ఖరారయ్యారు. శిగ్గావి నుంచి బీజేపీ అభ్యర్థిగా భరత్ బొమ్మై నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా యాసిన్ అహ్మద్‌ఖాన్ పఠాన్ పేరును గురువారం సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. సండూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇ.అన్నపూర్ణ, బీజేపీ నుంచి బంగారు హనుమంతు నామినేషన్‌లు వేశారు. చన్నపట్టణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీ యోగేశ్వర్ గురువారం నామినేషన్ వేయగా బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా నిఖిల్ బరిలోకి దిగుతున్నారు.

సండూరు కాంగ్రెస్ అభ్యర్థిగా అన్నపూర్ణ నామినేషన్ దాఖలు



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ, మద్దతుగా మంత్రులు

బళ్లారి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు శాసన సభ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఇ. తుకారాం సతీమణి అన్నపూర్ణ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సంతోష్ లాడ్, జమీర్ అహ్మద్, మాజీ మంత్రి బి. నాగేంద్ర, ఎమ్మెల్యేలు బి. నాగరాజు, ఎంపీ తుకారాం, మాజీ ఎమ్మెల్సీ అల్లం వీరభద్రప్ప, జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. స్థానిక ఏపీఎంసీ మార్కెట్ యార్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మొత్తం మూడు సెట్లను అన్నపూర్ణ దాఖలు చేశారు.

ఐటీ నగరిని హడలెత్తిస్తున్న... అక్రమ నిర్మాణాలు..!

● అనుమతులు లేని నిర్మాణాలు 2.46 లక్షలు
● కఠిన చర్యలకు సీఎం, డీసీఎంల ఆదేశం
● బాబుసాపాళ్య సంఘటనలో ఎనిమిదికి చేరిన మృతులు
● ప్రధాని రూ.2లక్షలు, సీఎం రూ.5లక్షల పరిహారం



బాబుసాపాళ్యలో బాధితులను పరామర్శిస్తున్న సీఎం

బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐటీ నగరిలో అక్రమ నిర్మాణాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నానీరకం నిర్మాణాలు, రాజకాలువలను ఆక్రమించుకుని అడ్డుగోలుగా సాగించిన నిర్మాణాలను కట్టడి చేయడంలో బీబీఎంపీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కనీస పర్యవేక్షణ లేకపోవడం, రెండు మూడు లేదా నాలుగైదు అంతస్తులకు అనుమతులు పొంది ఏకంగా 8-10 అంతస్తుల దాకా నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రాంతీయ బీబీఎంపీ రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటే చాలు నిర్మాణాలకు ఎటువంటి అడ్డు ఉండదనేది నగరంలో దశాబ్దాలకాలంగా సాగుతోంది. ఆ పరిణామమే నగరంలో తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

● నగరంలోని బాబుసాపాళ్యలో నాలుగు అంతస్తులకు అనుమతులు పొంది ఏడు అంతస్తులతో నిర్మాణం చేస్తున్న భవనం భారీ వర్షాలతోపాటు పిల్లర్‌లు తగినంత నాణ్యత, శక్తివంతంగా లేకపోవడంతో కుప్పకూలింది. మూడు రోజులుగా శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎనిమిది మంది మృతి చెందగా మరింత మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

నగరంలో 2.46 లక్షల కంటే ఎక్కువ అక్రమ నిర్మాణాలు

నిర్మాణదశలోని ఓ భవనం కూలిన ప్రమాదంతో ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బీబీఎంపీ అధికారుల గణాంకాల ప్రకారమే 2.46 లక్షల అక్రమ కట్టడాలు ఉన్నాయి. ఈ లెక్కలు రెండేళ్లక్రితం నాటివి. ఇటీవల రెండేళ్లలో నగరంలో నిర్మాణాల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు తెలుస్తోంది. నగర శివారుకంటే మధ్యభాగంలోనే అంతస్తులు పెంచుకోవడంతోపాటు ఒకటి రెండు అంతస్తులకే పరిమితమైన పురాతన భవనాలు తొలగించి అపార్ట్‌మెంట్‌ల తరహాలో నిర్మాణాలు పెరిగినట్టు తెలుస్తోంది. ఇసుక, ఐరన్‌తోపాటు ముడిసామగ్రి, కార్మికులకు డిమాండ్ వంటివి పరిగణనలోకి తీసుకుంటే పెరిగాయి. దీన్నిబట్టి అక్రమ నిర్మాణాలు వేలసంఖ్యలో ఉంటాయని తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలపై సుమోటోగా పిటిషన్ దాఖలు చేసుకున్న హైకోర్టు ధర్మాసనం అనుమతులు లేని భవనాలను తొలగించాలని బీబీఎంపీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోని నిర్మాణాలపై సమీక్ష జరపాలని 2022 సెప్టెంబరులోనే సూచించింది. అప్పటికి బీబీఎంపీ అధికారులు 2,46,948 నిర్మాణాలు ఉన్నట్టు నివేదిక సమర్పించారు.

పేరుకు మాత్రమే టాస్క్‌ఫోర్స్

పాలికె పరిధిలో 8 డివిజన్‌ల పరిధిలోనూ అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు గుర్తించారు. అక్రమ కట్టడాలు తొలగించడంతోపాటు నియంత్రణకోసం డివిజన్‌లవారీగా కమిషనర్ల అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. అనధికార నిర్మాణాలను నియంత్రించలేని అధికారులపై చర్యలు తీసుకునే అధికారాన్ని బీబీఎంపీ ముఖ్య కమిషనర్‌కు సూచించారు. అయితే ఇప్పటివరకు ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఒక్క భవనాన్ని కూడా కూల్చిన దాఖలాలు లేవు.

● కొందరు అధికారులు బిల్డర్‌లు, భవనాల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతి లేకుండా నిర్మించారని అప్పుడప్పుడు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. టౌన్ ప్లానింగ్ విభాగం భవనాలకు అనుమతులు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడం కూడా అక్రమ నిర్మాణాలకు కారణమవుతున్నట్టు తెలుస్తోంది. నిర్మాణాలలో నిబంధనలు ఉల్లంఘిస్తే 5శాతం జరిమానా విధించి క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది.

● ప్రతి నిర్మాణానికి నిర్దిష్టమైన విధానాలు పాటించేలా ఆదేశాలు ఉన్నాయి. గాలి, నీరు, వెలుతురు సమగ్రంగా ప్రతి భవనానికి ఉండేలా నిర్మాణాలు ఉండాల్సి ఉంటుంది. భవనానికి నాలుగువైపులా కొంతమేర స్థలాన్ని వదలాల్సి ఉంటుంది. కానీ కొత్త లే అవుట్‌లు మినహా పాత బెంగళూరు పరిధిలో అన్ని సౌకర్యాలు ఉండేలా నిర్మించిన దాఖలాలు లేవని తెలుస్తోంది.

కఠిన చర్యలకు సీఎం, డీసీఎంల ఆదేశం

హెబ్బాళ పరిధిలోని బాబుసాపాళ్యలో నిర్మాణదశలోని భవనం కూలిన సంఘటనతో సీఎం, డీసీఎంలు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం సీఎం సిద్దరామయ్య బాబుసాపాళ్యలో కూలిన భవనాన్ని పరిశీలించారు. క్షతగాత్రులు, మృతుల బంధువులను సీఎం ఓదార్చారు. ఈమేరకు నగరంలో నాలుగు రోజులుగా వర్షాలతో ఇబ్బంది పడిన అపార్ట్‌మెంట్ యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ కొన్ని రోజుల వ్యవధిలోనే మూడుసార్లు మునిగింది. ఈమేరకు యలహంక జోనల్ జాయింట్ కమిషనర్, కేంద్రీయ విహార అపార్ట్‌మెంట్‌కు నోటీసులు జారీ చేశారు. అపార్ట్‌మెంట్ చుటూ 8 అడుగులతో ఆర్‌సీసీ ప్రహరీ నిర్మించాలని తీర్మానించారు.



బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్‌కు సీఎం సూచనలు

నాలుగు రోజుల వర్షానికి నగరం అతలాకుతలం

నాలుగురోజులపాటు కురిసిన వర్షానికి నగరం అతలాకుతలమైంది. నగరంలో కొత్తగా ఏర్పాటైన ప్రాంతాల పరిస్థితి దారి తప్పింది. యలహంక, బ్యాటరాయనపుర, వైట్‌ఫీల్డ్, సర్జాపుర, ఎలక్ట్రానిక్ సిటీ, మైసూరు రోడ్డు తదితర ప్రాంతాలలోనూ రోడ్లు జలమయం కావడం, అపార్ట్‌మెంట్‌లలోకి భారీగా నీరు చేరడం, వేల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పరిస్థితి ఏర్పడింది.

ఎనిమిదికి చేరిన మృతులు - ప్రధాని, సీఎంల పరిహారం

బాబుసాపాళ్యలో నిర్మాణదశలోని భవనం కూలిన ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. నలుగురు బీహార్ వాసులు ఇద్దరు తమిళనాడు, ఒకరు ఉత్తరప్రదేశ్, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారిగా గుర్తించారు. మరో ఆరురుగు గాయపడగా ఇద్దరు ఆచూకీ తెలియరాలేదు. ఎనిమిది మందిని రక్షించగా వారిలో ఏడుగురు బీహార్ వాసులు ఒకరు చిత్తూరు జిల్లా వాసి. మృతి చెందినవారిలో బీహార్ రాష్ట్రానికి చెందిన అర్మాన్, మహ్మద్ సాహిల్, శ్రీరాన్ తిరుపాల్, సోలో పాస్తాన్, తమిళనాడుకు చెందిన మణికంఠన్, సత్యరాజు, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన తులసిరెడ్డి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పుల్లన్‌యాదవ్ ఉన్నారు. భవన నిర్మాణంలో మృతిచెందినవారి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. కాగా సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఎం సిద్దరామయ్య గురువారం మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో...

కిశోర్‌కుమార్ భారీ విజయం



బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ బొట్యాడి భారీ విజయం సాధించారు. గురువారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగింది. ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి రాజుపూజారిపై 1600 ఓట్ల మెజారిటీ సాధించారు. తద్వారా బీజేపీ తమ స్థానాన్ని పదిలం చేసుకుంది. కోట శ్రీనివాసపూజారి లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందిన మేరకు ఉప ఎన్నిక జరిగింది. ఈనెల 21న పోలింగ్ నిర్వహించారు. 392 పోలింగ్‌కేంద్రాలలో జరిగిన ఎన్నికల్లో 5906మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంగళూరులోని సెయింట్ అలోషియస్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. బీజేపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ బొట్యాడికి 3655 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి రాజు పూజారికి 1958 ఓట్లు, ఎస్‌డీపీఐ అభర్థి అన్వర్‌సాదాత్‌కు 195 ఓట్లు, ఇండిపెండెంట్ దినకర్ ఉల్లాళ్‌కు 9 ఓట్లు రాగా, 90 చెల్లని ఓట్లు ఉన్నాయి. ఎన్నికల్లో ఓ పోలింగ్‌బూత్‌లో వందశాతం, మరో ఐదారు పోలింగ్‌బూత్‌లో 99శాతం ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీగా గెలుపొందిన కిశోర్‌కుమార్ బొట్యాడికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, అగ్రనేతలు యడియూరప్ప, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై అభినందించారు. కిశోర్‌కుమార్ బొట్యాడి దక్షిణకన్నడ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కల్పనశాఖ ట్రైనర్‌గా కొనసాగుతున్నారు. 1994 నుంచి 98వరకు పుత్తూరు నరిమొగరు ప్రాంతీయ ఆర్‌ఎస్‌ఎస్ మండలసేవ చేశారు. ఏబీవీపీలో 2000 నుంచి 2004వరకు విద్యార్థి విభాగంలో కొనసాగారు. బజరంగ్‌దళ్‌లో మంగళూరు, కొడగు, ఉడుపి, కాసరగూడు సహసంచాలకులుగా వ్యవహరించారు. పుత్తూరు సాహిత్యసంగమ విభాగంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు.

అదృష్ట పరీక్షకు నిఖిల్

● కార్యకర్తల ఒత్తిడితో చన్నపట్టణ బరిలోకి...
● ఒప్పించిన జేడీఎస్ అగ్రనేత దేవెగౌడ

బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉప ఎన్నికల్లో హై ఓల్టేజ్‌గా మారిన చన్నపట్టణ నియోజకవర్గానికి బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా జేడీఎస్ పార్టీ యువవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమార్ అనూహ్యంగా అదృష్ట పరీక్షకు సిద్ధమయ్యారు. జేడీఎస్ సీనియర్ నేత కుమారస్వామి ప్రాతినిధ్యం వహించి లోక్‌సభకు వెళ్లి కేంద్రమంత్రి అయ్యారు. ఓవైపు జేడీఎస్ పార్టీ నియోజకవర్గాన్ని వదులుకోలేక మరొకరికి అవకాశం ఇవ్వలేక రెండు నెలలుగా తర్జనభర్జన పడింది. ఇదే నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత, ఐదుసార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించిన సీపీ యోగేశ్వర్ టిక్కెట్ ఆశించారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల వేళ కుమారస్వామి నా స్థానాన్ని సీపీ యోగేశ్వర్‌కు ఇస్తానని ప్రకటించారు. అయితే ఆచరణకు వచ్చేసరికి సాధ్యం కాలేదు. యోగేశ్వర్‌కు జేడీఎస్ ద్వారా టిక్కెట్ ఇచ్చే ప్రస్తావన తీసుకురాగా అందుకు అతను ససేమిరా అన్నాడు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత యోగేశ్వర్ మూడు రోజుల్లోనే వ్యూహాన్ని మార్చేశాడు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడం, ఆ వెంటనే కాంగ్రెస్‌లో చేరడం, గురువారం ఏకంగా ఆ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని దక్కించుకునేందుకు ఎంతకైనా సిద్ధమనేలా మారింది. మరోవైపు డీసీఎం డీకే శివకుమార్ చన్నపట్టణను ప్రతిష్టగా భావించారు. చన్నపట్టణకు అనుబంధమైన బెంగళూరు గ్రామీణ లోక్‌సభ స్థానం నుంచి తమ్ముడు డీకే సురేశ్‌ను ఓడించేందుకు కుమారస్వామి వ్యూహాత్మకంగా వ్యవహరించడాన్ని జీర్ణించుకోలేని ఆయన ఇటీవల రెండు నెలలుగా చన్నపట్టణకు పదిసార్లకు పైగా సందర్శించారు. వందలకోట్లు గ్రాంటు కేటాయించారు. తానే అభ్యర్థినంటూ ప్రచారం చేసుకున్నారు. ఇలా సాగుతుండగానే అనూహ్యంగా యోగేశ్వర్ తెరపైకి రావడంతో సాదరంగా స్వాగతించి టిక్కెట్ ఇప్పించారు.యోగేశ్వర్‌కు ధీటైన అభ్యర్థికోసం బీజేపీ-జేడీఎస్ అగ్రనేతలు గురువారం సుదీర్ఘంగా సమావేశం జరిపారు. సీనియర్ నేత యడియూరప్ప నివాసంలో భేటీ అయ్యారు. అనంతరం జేడీఎస్ కార్యాలయానికి వెళ్లారు. జేడీఎస్ నేత దేవేగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామి, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, పార్టీ అధ్యక్షుడు విజయేంద్రతో పాటు పలువురు కీలకనేతలు పాల్గొన్నారు. అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో తీవ్రమైన కసరత్తు జరిగింది. చివరకు నిఖిల్‌ను బరిలోకి దింపడం సముచితమనే అభిప్రాయానికి వచ్చారు. నిఖిల్‌ను తాత దేవేగౌడ ఒప్పించారు. యడియూరప్ప సంపూర్ణంగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఇలా చన్నపట్టణకు అభ్యర్థిగా నిఖిల్ పేరు ఖరారు చేశారు. ఎన్నికలు ముగిసేదాకా నిఖిల్ వెంటే ఉంటానని దేవేగౌడ వెల్లడించారు. మరోవైపు యడియూరప్ప బీజేపీ-జేడీఎస్ నాయకుల సమన్వయంతో నిఖిల్‌ను గెలిపిస్తామన్నారు. సమావేశంలో బండెప్ప కాశంపూర్, సారామహేశ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



నిఖిల్ కుమార్



నిఖిల్‌కు టిక్కెట్ ఖరారయ్యాక యడియూరప్ప, కుమారస్వామికి సన్మానం



మాజీ సీఎం యడియూరప్పతో కేంద్రమంత్రి కుమారస్వామి తదితరుల చర్చలు

మూడోసారి అదృష్ట పరీక్షకు నిఖిల్

జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవేగౌడ మనవడు, కేంద్ర మంత్రి కుమారస్వామి ఏకైక వారసుడు నిఖిల్ మూడోసారి అదృష్ట పరీక్షకు సిద్ధమయ్యాడు. సినిమారంగంలో కొనసాగుతున్న నిఖిల్ వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చేందుకు అడుగులు వేశారు. 2019 లోక్‌సభ ఎన్నికలవేళ కాంగ్రెస్-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా మండ్య నుంచి పోటీ చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థి సుమలత చేతిలో చిత్తుగా ఓడిపోయారు. ఆ తర్వాత 2023 శాసనసభ ఎన్నికల్లో అమ్మ అనితా ప్రాతినిధ్యం వహిస్తున్న రామనగర నుంచి పోటీ చేసి మరోసారి ఓటమి చవిచూశారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో అదృష్ట పరీక్షకు సిద్ధమై తండ్రి ప్రాతినిధ్యం వహించిన చన్నపట్టణ నుంచి అభ్యర్థి అయ్యారు.

లోకాయుక్త విచారణకు

ముడా మాజీ కమిషనర్ పాలయ్య



మీడియాతో మాజీ కమిషనర్ పాలయ్య

బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లోకాయుక్త విచారణకు ముడా మాజీ కమిషనర్ పాలయ్య హాజరయ్యారు. పాలయ్యకు రెండోసారి లోకాయుక్త నోటీసులు జారీ చేసిన మేరకు గురువారం హాజరయ్యారు. ఇదే సందర్భంగా పాలయ్య మీడియాతో మాట్లాడుతూ లోకాయుక్త తొలుత నోటీసులు ఇచ్చిందని అందుబాటులో లేని కారణంగా రాలేదన్నారు. లోకాయుక్త అడిగిన అని ప్రశ్నలకు సమాధానం ఇచ్చానన్నారు. మరిన్ని వివరాలు తెలపలేనంటూ దాటవేశారు.

కాంగ్రెస్ గూటికి బీజేపీ ఎమ్మెల్యేలు

● ఎస్‌టీ సోమశేఖర్ సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రెబెల్‌గా మారిన ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యోగేశ్వర్‌ను బీజేపీ బాగా వాడుకుని వదిలేసిందన్నారు. బీజేపీ వారు ఎటువంటి క్రమశిక్షణా చర్యలకు సిద్ధమైన భయపడేది లేదన్నారు. నా నియోజకవర్గం అభివృద్ధి ముఖ్యమన్నారు. అందుకే సీఎం, డీసీఎంలను కలుస్తుంటానన్నారు. త్వరలోనే 8మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారని అన్నారు.

ముడిఖనిజం గల్లంతు కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే దోషి

● ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పు



బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కన్నడ జిల్లా బెలెకేరి ఓడరేవులో నిల్వ ఉంచిన ముడిఖనిజం గల్లంతులో కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ శైల్ దోషిగా పేర్కొంటూ ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పు ప్రకటించింది. గురువారం ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పును ప్రకటించగా కోర్టు ప్రాంగణంలోనే సీబీఐ అధికారులు ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు. వివిధ కేసుల ద్వారా స్వాధీనం చేసుకున్న 11,312 మెట్రిక్ టన్నుల ముడిఖనిజాన్ని అనుమతి లేకుండా రవాణా చేశారు. ఈకేసుకు సంబంధించిన పిటీషన్‌పై ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు సుదీర్ఘకాలంగా విచారణలు జరిపింది. గురువారం న్యాయమూర్తి సంతోష్ గజానన భట్ తీర్పును ప్రకటించారు. ఎమ్మెల్యే సతీశ్‌శైల్, మహేశ్‌బిలియె, మల్లికార్జున షిప్పింగ్‌లు దోషులుగా తేలుస్తూ తీర్పు ప్రకటించింది. శిక్షకు సంబంధించిన వివరాలను శుక్రవారం ప్రకటిస్తామని న్యాయమూర్తి తెలిపారు. మొత్తం 6 కేసులలో ప్రజాప్రతినిధుల కోర్టు తుదితీర్పును ప్రకటించింది. బెలెకేరి ఓడరేవులోని ముడిఖనిజం గల్లంతుకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. విచారణ జరిపిన సీబీఐ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. సీబీఐ అధికారులు కాంగ్రెస్ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకుని పరప్పన అగ్రహార సెంట్రల్‌జైల్‌కు తరలించారు.

బీచ్‌లలో టెంట్‌లు, మందు పార్టీలకు అవకాశం

● గోవా తరహాలో అమలుకు ప్రతిపాదన

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించే దిశగా గోవా తరహాలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. పర్యాటకశాఖ మంగళూరులో కనెక్ట్-2024 పేరిట నిర్వహించిన సదస్సులో పర్యాటకశాఖ డైరెక్టర్ కేవీ రాజేంద్ర పలు ప్రతిపాదనలు చేశారు. ఉత్తరకన్నడ జిల్లానుంచి ఉడుపి, దక్షిణకన్నడ జిల్లా పరిధిలో 320 కిలోమీటర్ల సుదీర్ఘమైన సముద్ర తీరం ఉందని ఈ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించేందుకు బీచ్‌లలో టెంట్‌లు ఏర్పాటు చేయడం, మద్యం విక్రయాలు, మందు పార్టీలకు అవకాశం కల్పించే ప్రస్తావనను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు బీచ్‌లలో కొన్ని మార్పులు తప్పనిసరి అన్నారు. బీచ్‌లలో మద్య నిషేధానికి సంబంధించిన నిబంధనలు సడలించాల్సిన అవసరం ఉందన్నారు. బీచ్‌లలో రక్షణ కల్పించేలా రాత్రివేళ ఎక్కువసమయంపాటు పర్యాటకులు గడిపేందుకు భారీ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఇక్కడి సముద్రతీరంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలను గుర్తించాలని జిల్లా అధికారులకు సూచించారు. అర్ధరాత్రి వరకు బీచ్‌లలో పర్యాటకులు గడిపేలా అవకాశం కల్పించాల్సి ఉందని దక్షిణకన్నడ జిల్లా అధికారి ముల్లై ముగిళన్ అభిప్రాయపడ్డారు. ఇందుకు అనుగుణంగా మంగళూరులో రాత్రి 1 గంటవరకు హోటళ్లు, రెస్టారెంట్‌లు తెరిచి ఉంచేలా అనుమతులు ఇవ్వాలని సూచించారు. గోవాలోనూ ఇటువంటి విధానాలే ఉన్నాయని, వాటిని అమలు చేస్తే పర్యాటకులు ఇక్కడ గడిపేందుకు ఆసక్తి చూపుతారన్నారు.



ఉడుపి జిల్లా మల్పె బీచ్






తూర్పు.. పడమర..!

ముసిరిన చీకట్లు..
పడమటి సంధ్యవి కాదు
లేలేత పసిడి వెలుగులు..
తూరుపు దిక్కున కాదు
కనిపించేదంతా నిజం కాదు..!
ఒక్కోసారి..
చూపులు మోసగిస్తాయి..!
ఆలోచించి.. శోధించి..
నిజమేమిటో నిర్ధారించుకోవాలి..!

(అనంతపురం క్లాక్ టవర్ పై ఓవర్ బ్రిడ్జిపై.. గురువారం ఉదయం.. ఏకకాలంలో తూర్పున మసక చీకటి.. పడమట వెండి వెలుగులు)



చిరునామా చిక్కులు...!

పథకాలకు పేర్లు నమోదు చేసుకోవాలన్నా, బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, బడికెళ్లినా, గుడికెళ్లినా ఎక్కడైనా ఆధార్ తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. మరణానికి, జననానికి ఇలా ప్రతి దానికి ఆధార్‌ను అనుసంధానం చేశారు. అయితే ఆధార్‌లో ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఉడాయ్ నిబంధనల మేరకు పేర్ల మార్పు, పుట్టిన తేదీల మార్పు, చిరునామాల మార్పు, ఫొటో, బయోమెట్రిక్ తదితర అన్ని అంశాలకు అవకాశం కల్పించారు. అయితే ఏ మార్పు చేయాలన్నా సరైన ప్రూఫ్ తప్పనిసరి. అసలు చిక్కంతా అడ్రస్ మార్పుతోనే వచ్చింది. ఎవరైనా ఇళ్లు మారినా, ఊరు మారినా ఆధార్‌లో అడ్రస్ మార్చుకోవాలి. ఆ అప్లికేషన్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం తప్పనిసరి చేశారు. అందులో పలు రకాల గెజిటెడ్ ఆఫీసర్ల సంతకాలు చేయవచ్చని పేర్కొనప్పటికీ కేవలం తహసీల్దార్ సంతకాన్ని మాత్రమే అంగీకరిస్తుండంతో అసలు సమస్య మొదలయ్యింది. ఇతర అధికారులతో సంతకం చేయిస్తే ఆ దరఖాస్తులు తిరస్కరిస్తుండంతో లబ్దిదారులకు పాట్లు తప్పడం లేదు.

- అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆంధ్రజ్యోతి

సంతకాలంటే జంకుతున్నారు..

ఆధార్‌లో సంతకాలు చేయాలంటే గెజిటెడ్ అధికారులు బెంబేలెత్తుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. గతంలో జిల్లాలోని పలువురు తహసీల్దార్ల సంతకాలతో ఆధార్‌లో అడ్రస్‌లు మార్చుకున్న కొందరు వాటిని దుర్వినియోగం చేయడమే దీనికి ప్రధాన కారణం. ఆధార్‌లో చిరునామాలను మార్చుకొని కొందు భూ కబ్జాలు చేసినట్లు చేసినట్లు సమాచారం. మరికొందరు డబుల్ రిజిస్ట్రేషన్లు తదితర అక్రమాలకు పాల్పడిన దాఖలాలూ ఉన్నాయి. దీంతో సంతకాలు పెట్టాలంటే అధికారులు జంకుతున్నారు. మరికొందరు అధికారులైతే సరైన ఆధారాలు, అడ్రస్ ఎందుకు మారుతున్నారు తదితర వివరాలపై ఆరా తీసి సంతకాలు చేస్తున్నారు.

ఆధార్‌లో అడ్రస్ మార్పునకు గెజిటెడ్ సంతకాలతో తిప్పలు



ఆధార్ సెంటర్ వద్ద బారులు తీరిన కార్డుదారులు (ఫైల్)

నిబంధనల మేరకు అడ్రస్ మార్పు చేసుకునే దరఖాస్తులో గెజిటెడ్ అధికారుల జాబితాలో గెజిటెడ్ ఆఫీసర్ గ్రూప్-ఏ, విలేజ్ పంచాయతీ హెడ్ ఆఫ్ ముకియా, గెజిటెడ్ ఆఫీసర్ గ్రూప్-బీ, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మున్సిపల్ కౌన్సిలర్, తహసీల్దార్, హెడ్ ఆఫ్ రికజ్‌నైజ్డ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్, సూపరింటెండెంట్, వార్డెన్, మ్యాట్రన్, హెడ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ రికజ్‌నైజ్డ్ షెల్టర్ హోమ్స్, ఆర్ఫనేజెస్, ఈపీఎఫ్ఓ ఆఫీసర్ల హోదాలను పొందుపరిచారు.

జాబితాలో ఎందరో ఉన్నా..

అయితే వీటిలో ఏ ఒక్క అధికారి సంతకాన్ని చేయించుకొని ఆధార్ సెంటర్‌లో నమోదు చేయించినప్పటికీ... వారం, పదిరోజులకు అప్లికేషన్ తిరస్కరించినట్లు మొబైల్‌కు మెసేజ్ వస్తోంది. కేవలం తహసీల్దార్ సంతకాలతో కూడిన వాటికే అడ్రస్ మార్పులు జరుగుతుండంతో దరఖాస్తుదారులు ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరగక తప్పడం లేదు.

తహసీల్దార్ సంతకాలకే అంగీకారం..లేదంటే దరఖాస్తుల తిరస్కారం

లబ్ధిదారులకు తప్పని తిప్పలు

వార్డెన్‌తో సంతకం చేయించినా రిజెక్ట్ అయ్యింది...



ఆధార్ కార్డులో అడ్రసు మార్చుకోవాలని దరఖాస్తులో గెజిటెడ్ సైన్ ఆఫీసర్ల లిస్టులో వార్డెన్ ఆప్షన్ ఉంటే... నాకు తెలిసిన హాస్టల్ వార్డెన్‌తో సంతకం చేయించి అనంతపురం పోస్టాఫీసులో ఇచ్చాను. అయితే పదిరోజులకు అప్లికేషన్ రిజెక్ట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అధికారులను అడిగితే తహసీల్దార్‌తోనే సంతకం చేయిచాలంటున్నారు. ఇప్పటికైనా నిబంధలను మార్చి అందరు అధికారుల సంతకాలు చెల్లేలా అవకాశం కల్పించాలి. - **శ్రీనివాసులు, ధర్మవరం**

మా ఊళ్లో హెడ్‌మాస్టర్‌తో సంతకం చేయించా...



నా ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఆధార్ సెంటర్‌కు వెళ్లాను. ఒక ఫారం ఇచ్చారు. అందులో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించుకొని రమ్మన్నారు. మా ఊళ్లో స్కూల్ హెచ్‌ఎంతో సంతకం పెట్టించుకుని వచ్చాను. అప్లై చేసిన వారం రోజులకు దరఖాస్తు తిరస్కరించినట్లుగా మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. ఇదేమని అడిగితే ఎమ్మార్వో సంతకం చేయించమని చెప్పారు. మా ఊళ్లోకి వెళ్లి అడిగితే వాళ్లు చేసేది లేదంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

- అరుణ్‌కుమార్, గార్లదిన్నె

నేటి నుంచి పశుగణన

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి 21వ భారత పశుగణన సర్వే ప్రారంభం కానుంది. ఇదివరకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి సర్వే చేయాలని నిర్ణయించినా, కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. శుక్రవారం నుంచి నాలుగు నెలలపాటు సర్వే కొనసాగనుంది. పశుగణన సర్వే కోసం జిల్లా వ్యాప్తంగా 189 ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్ వైజర్లను నియమించారు. ప్రతి ఐదేళ్లకోమారు పశుగణన సర్వే జరుగుతోంది. శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పశుగణన సర్వే ప్రారంభిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. నాలుగు నెలలపాటు ఈ సర్వే కొనసాగుతుందన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి : డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టడానికి తగిన విధంగా నిధులు కేటాయించడం జరిగింది. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్ సూచించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధుల వినియోగంపై ఉమ్మడి జిల్లా అటవీశాఖ సిబ్బందికి గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలోని సమావేశ భవనంలో వర్క్‌షాప్ నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్, సబ్‌డీఎఫ్ఓ, అనంతపురం ఇంచార్జ్ డీఎఫ్ఓ ఆనంద్ హాజరై సిబ్బంది విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో డీఆర్‌డీఏ ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాలోని డీఆర్వోలు ఊసేనప్ప, చాప్లనాయక్, దీప, దామోదర్‌రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్‌లో మట్టి తరలింపు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేంజ్ పరిధిలో శింగనమల బీట్‌లోని తరిమెల సమీపంలో అటవీశాఖ స్థలం నుంచి స్థానికులు గురువారం మట్టి తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. స్థానిక బీట్ అధికారి తేజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో స్పందించిన రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ అధికారులు అక్బర్, ప్రవీణ్‌కుమార్‌ను క్షేత్రస్థాయికి వెళ్లి వాహనాలను సీజ్ చేశారు. అపరాధరుసుం చెల్లించిన అనంతరం వాటిని విడుదల చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అనంతపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జంగాలపల్లిలో వర్షాలకు దెబ్బ వేరుశనగ పంటను గురువారం సీపీఎం మండల కార్యదర్శి రామాంజినేయులు ఆధ్వర్యంలో పరిశీలించారు. అధిక వర్షాల నల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి పోతులయ్య, రైతులు నరేష్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పెద్ద పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా మల్లోల

అనంతపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా మల్లోల నియమితులయ్యారు. గురువారం రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను, ఆర్డీఓలను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో మల్లోలను అనంతపురానికి నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో అనంతపురం ఆర్డీఓ గా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడున్న డీఆర్ఓ రామకృష్ణారెడ్డిని బదిలీ చేశారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడిలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

15 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా పామిడిలో 20.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు 17.4, తాడిపత్రి 11.2, రాప్తాడు 10.0, గార్లదిన్నె 9.4, వజ్రకరూరు 9.2, గుత్తి 8.0, గుంతకల్లు 7.2, యాడికి, పెద్దపప్పూరు 5.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగ తా మండలాల్లో 3.0మి.మీ. లోపు నమోదైంది.

గంటన్నరపాటు లిఫ్టులోనే రోగులు



అనంతపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకే తలమానికమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహణ అధ్వానంగా ఉందనడానికి గురువారం చోటు చేసుకున్న లిఫ్టు ఘటనే నిదర్శనం. చికిత్సకోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లిన నడవలేని ఐదుగురు రోగులు లిఫ్టు ఎక్కారు. అది మధ్యలోనే ఆగిపోయింది. దాదాపు గంటన్నరపాటు ఆ రోగులు లిఫ్టులోనే ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత మెకానిక్‌లు వచ్చి లిఫ్టు తాళంతో తెరవడంతో బయటకు వచ్చి ఊపిరి పీల్చుకున్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో లిఫ్టును తెరుస్తున్న ఎలక్ట్రిసిటీ సిబ్బంది, లిఫ్టులో ఇరుక్కుపోయిన పేషెంట్లు బయటకు వస్తున్న దృశ్యం

తుస్సుమన్న సమావేశం

అనంతపురం క్రైం, అక్టోబరు 24 : పారిశుధ్య కార్మికుల సమస్యలపై మున్సిపల్ యూనియన్ వర్కర్స్ నాయకులతో పాలకవర్గం, అధికారులు నిర్వహించిన సమావేశం తుస్సు మంది. మేయర్ చాంబర్‌లో గురువారం మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య, కమిషనర్ నాగరాజుతో కలిసి సమావేశమయ్యారు. యూనియన్ నాయకులు వెంకటనారాయణ, ఏటీఎం నాగరాజు, నాగభూషణ సమస్యలు వివరించారు. వాటిపై పాలకవర్గం, అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవటంతో యూని యన్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాన్ని అర్థాంతరంగా ముగించినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనసాగిన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ పంపిణీ గురువారం కొనసాగింది. ఇప్పటి దాకా 14835 మంది రైతులు 21009 క్వింటాళ్ల పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో ఇప్పటి దాకా 20669 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేశారు.

మున్సిపల్ స్థలాలను కాపాడండి

కమిషనర్‌కు సీపీఐ నేతల వినతి

అనంతపురం విద్య, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ స్థలాలను కాపాడాలని సీపీఐ నాయకులు నగర కమిషనర్ నాగరాజును కోరారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ నాయకులు కమిషనర్‌ను ఆయ న చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.... స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రూ. వంద కోట్ల విలువ చేసే ఏడెకరాల నగరపాలక సంస్థ స్థలం అన్యాక్రాంతం అవుతోందన్నారు. 2019-2024 మధ్య కాలంలో వైసీపీ నేతలు ఈ స్థలంలో అక్రమ కట్టడాలు కట్టారన్నారు. అలాగే ఖాజానగర్, శ్రీనగర్ కాలనీ తదితర చోట్ల కోట్ల విలువైన ఓపెన్ స్థలాలు సైతం కబ్జా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు రమణ, అల్లి పీరా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్స్‌కు 'మాన్యువల్' సమస్య

భయోమెట్రిక్!





బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమశాఖ వసతిగృహాలకు మాన్యువల్ రిజిస్టర్ అందని ద్రాక్షలా మారింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వంలో బయోమెట్రిక్, మాన్యువల్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) రెండూ అమలు చేసేది. దీంతో బయోమెట్రిక్ సమస్య ఏర్పడిన సమయాల్లో మాన్యువల్ రిజిస్టర్ ఉండటంతో ఎక్కడా సమస్య లేకుండా సవ్యంగా సాగిపోయేది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం మాన్యువల్ రిజిస్టర్ నిర్వహణ ఎత్తేసి... బయోమెట్రిక్ మాత్రమే అమలు చేసింది. అయితే బయోమెట్రిక్ పనిచేయని సమయంలో వార్డెన్లు పలు ఇబ్బందులు పడేవారు. అప్పట్లో ఈ సమస్యను గమనించిన బీసీ సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖల రాష్ట్రస్థాయి అధికారులు మాన్యువల్‌ను కొనసాగించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకున్నారు. అయితే ఎస్సీ వెల్ఫేర్‌లోని కొందరు అధికారులు దీన్ని నిర్లక్ష్యం చేశారు. దీంతో బయోమెట్రిక్, ఐరిష్ పనిచేయని సమయంలో ఆ వార్డెన్ల బాధలు వర్ణనాతీతం. తాజాగా... పలు హాస్టళ్లలో బయోమెట్రిక్ పనిచేయకపోవడంతో దాదాపు పదుల సంఖ్యలో విద్యార్థులకు వార్డెన్లు సొంత ఖర్చులతోనే మెనూ అమలు చేయాల్సి వస్తోంది. ఆ సొమ్ము తమకు ఎవరు చెల్లిస్తారని... తమ జీతాన్ని సైతం ఖర్చు చేయా ల్సి వస్తోందని ఆ వార్డెన్లు మండిపడుతున్నారు. ఇప్పటికే డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం... మాన్యువల్ లేకపోవడం... తదితర సమస్యలతో సతమతమవుతున్న తమకు ఈ బయోమెట్రిక్ మరో సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యం ఆయా సంక్షేమశాఖల రాష్ట్రస్థాయి అధికారులు మారడంతో మాన్యువల్ రిజిస్టర్ నిర్వహణను మళ్లీ అమల్లోకి తీసుకొస్తారని ఎస్సీ సంక్షేమశాఖ వార్డెన్లు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మొరాయిస్తున్న బయోమెట్రిక్, ఐరిష్ ...

ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల్లో మాత్రమే బయోమెట్రిక్ అమలు చేస్తున్నారు. వార్డెన్లు బయోమెట్రిక్, ఐరిష్ యంత్రాలతోనే రిజిస్టర్ నమోదు చేస్తున్నారు. ఆ యంత్రాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అందజేసినవే. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కటంటే ఒక్క కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు, ఐరిష్‌లు అందించిన పాపాన పోలేదు. కాగా ఎక్కువ కాలం కావడంతో ఆ యంత్రాలు మొరాయిస్తున్నాయి. గత ప్రభుత్వంలో పలుమార్లు బయోమెట్రిక్, ఐరిష్ యంత్రాలు ఇవ్వాలని మొర పెట్టుకున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా వాటిని తరచూ రిపేరీలు చేయించుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ఆ యంత్రాల్లో బయోమెట్రిక్ పదుల సంఖ్యలో విద్యార్థులకు పడకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విద్యార్థులకు కాస్మెటిక్ తిప్పలు...

ఈ వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలను ప్రభుత్వమే అందిస్తోంది. 3 నుంచి 6వ తరగతి వరకు ఒక్కో బాలుడికి రూ. 125, బాలికకు రూ. 130, 7వ తరగతి నుంచి 10వ తరగతి బాలుడికి రూ. 150, బాలికకు రూ. 200, ఇంటర్మీడియట్.. ఆపై ఉన్న విద్యార్థికి రూ. 200, విద్యార్థినికి రూ. 250 ప్రకారం కాస్మెటిక్స్ చార్జీలను అందిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు నేరుగా వారి చేతికి నెలనెలా ఈ డబ్బులు అందించేది. దీంతో విద్యార్థులు తమకు కావాల్సిన కాస్మెటిక్స్‌ను నేరుగా కొనుగోలు చేసుకునేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నగదును విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసేలా నిర్ణయించింది. గడిచిన ఐదేళ్ల కాలంలో పలు హాస్టళ్లలోని విద్యార్థులకు ఆన్‌లైన్ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో... ఆరు నెలలు... మరికొన్ని చోట్ల సంవత్సరంపైగా కాస్మెటిక్స్ చార్జీలు పెండింగ్‌లో ఉంచారు. ఇలా గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న కాస్మెటిక్స్ ఆన్‌లైన్ విధానంతో వందల సంఖ్యలో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

- వైసీపీ హయాంలో ఆ రిజిస్టర్ తొలగింపు
- బయోమెట్రిక్, ఐరిష్ పనిచేయకపోవడంతో వార్డెన్ల ఇబ్బందులు
- వేలిముద్రలు పడని సమయంలో సొంత నిధులతో మెనూ అమలు
- కాస్మెటిక్స్ చార్జీలు ఆన్‌లైన్ చేయడంతో విద్యార్థులకూ తప్పనితిప్పలు
- ఇదీ జిల్లాలో ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల పరిస్థితి

రూ. వేలల్లో నష్టం ...

బయోమెట్రిక్, ఐరిస్ యంత్రాలు పనిచేయని సందర్భాల్లో వార్డెన్ల సమస్యలు అన్నీఇన్నీ కావు. ఒక్కో విద్యార్థికి రోజుకు 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 40, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 46, కాలేజీ ఒక్కో విద్యార్థికి రూ. 53 (భోజనం ఖర్చు)పైగానే వస్తుంది. ఈ లెక్కన ఒక రోజుకు 20 మంది విద్యార్థులకు బయోమెట్రిక్ పడకపోయినా... రూ. 1000లకుపైగా వార్డెన్ చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఇలా రెండు.. మూడు రోజులు బయోమెట్రిక్ పనిచేయలేదంటే.. దాదాపు రూ. 3 నుంచి రూ. 4 వేలు ఆ వార్డెన్ నష్టపోవాల్సి వస్తోంది.

మాన్యువల్‌కు అనుమతి ఇవ్వాలి ...

ఎస్సీ హాస్టళ్లకు మాన్యువల్ లేకపోవడంతో వార్డెన్లు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు జరిగే సమయంలో అథెంటికేషన్ కాని సమయంలో వార్డెన్లు చేతి నుంచి ఖర్చులు పెట్టుకొని భోజనం పెట్టాల్సి వస్తోంది. మాన్యువల్ ఉంటే అటు విద్యార్థులు... ఇటు వార్డెన్లకు సమస్య ఉండదు. నెట్ సరిగ్గా లేకపోయినా.. సర్వర్ బిజీగా ఉన్నా.. సెలవుల్లో విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి మళ్లీ హాస్టళ్లకు వచ్చినప్పుడు ఫింగర్ ప్రింట్లు పడవు. ఈ సమస్యలన్నీ దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర అధికారులు మాన్యువల్‌ను అమలు చేయాలి.

- రామునాయక్, ఎస్సీ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

రబీ నుంచి పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రబీ సీజన్ నుంచి పంటల బీమా వర్తింపు కోసం రైతులు నిర్దేశించిన ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన గురువారం గుంటూరు నుంచి వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలిసి కలెక్టర్, జేసీ, జిల్లా వ్యవసాయాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది రబీ నుంచి రాబోవు సీజన్లలో రైతులు స్వయంగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు తీసుకునే రైతులు తప్పని సరిగా బ్యాంక్‌ల ద్వారా ప్రీమియం కట్టాల న్నారు. మిగిలిన రైతులు సీఎస్‌సీ (మీసేవ) లేదా ఇన్సూరెన్స్ కంపెనీ లేదా ఎన్‌సీఐ ద్వారా ప్రీమి యం చెల్లించాలన్నారు. బీమా ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, భూమి వివరాలు, వన్‌బీ, పంట సాగు ధ్రువీకరణ పత్రం, ఫోన్ నెంబర్, ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ నెంబర్‌లను బ్యాంకు లేదా మీసేవ కేంద్రాల్లో ఇవ్వాలన్నారు. జిల్లాలో దిగుబడి ఆధారిత పంటల బీమా కింద పప్పుశనగ పంటకు గ్రామ యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న పంటలను మండల యూనిట్‌గా ఇచ్చారన్నారు. వరి మినహా మిగతా పంటలకు డిసెంబరు 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాల న్నారు. వరికి డిసెంబర్ నెలాఖరుదాకా గడువు ఉందన్నారు. పప్పుశనగకు హెక్టారుకు రూ.1125, వరికి రూ.1575, జొన్నకు రూ.788, మొక్కజొన్నకు రూ.1313, వేరుశనగకు రూ.1200 ప్రీమియం చెల్లించాలన్నారు. వాతావరణ బీమా కింద టమోటాను ఎంపిక చేశారని తెలిపారు. టమోటాకు హెక్టారుకు రూ.4వేలు ప్రీమియం ప్రకారం డిసెంబరు 15లోగా చెల్లించాల న్నారు. ప్రీమియం చెల్లించిన రైతులు తప్పని సరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. రబీ పంటల బీమాపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆచంట వెంకట సాంఖ్యాయనశర్మ (జయంతి)



ఆచంట వెంకట సాంఖ్యాయన శర్మ తూరుగోదావరి జిల్లా ఆచంట గ్రామంలో 1864 అక్టోబరు 25న జన్మించారు. బాల్యంలోనే సంస్కృతాంధ్ర భాషలలో విశేషమైన పాండిత్యం గడించారు. తొలితరం తెలుగు కథకుడు. కవిత్వం, చిత్రలేఖనం, గాయనం, నృత్యం మొదలైన కళలన్నీ అభ్యసించారు. సుజన ప్రమోదిని, కల్పలత అనే పత్రికలు నడిపారు. శతావధానాలు కూడా చేశారు. మేరంగి సంస్థానంలో దివానుగా పనిచేశారు. ఆంధ్ర నాటక కళాపరిషత్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. సుధానిధి, మనోరమ అనే పద్యకావ్యాలు, 'ఆంధ్ర పంద్యావళి' అనే ఖండ కావ్య సంపుటి, ఇతర రచనలు ఎంతో పేరొందాయి. ఆంధ్రసారస్వత పరిషత్తువారు 'మహోపాధ్యాయ'తో గౌరవించారు. 1933లో కన్నుమూశారు.

పాబ్లో పికాసో (జయంతి)



స్పానిష్ దేశ శిల్పి, చిత్రకారుడు పాబ్లో పికాసో 1881 అక్టోబరు 25న జన్మించారు. చిత్రలేఖనంలో క్యూబిజంను ప్రోత్సహించిన కళాకారుడు. 20వ శతాబ్దంలో చిత్రకారులలోనే అత్యంత పేరొందారు. 1901లో తల్లిప్రేమ, 1937లో 'గుయెర్నికా' చిత్రం, ఇంకా 'లే డెమొసెల్లిస్ డి అవినాన్' గొప్ప కళా ఖండాలుగా పేరొందాయి. 1962లో లెనిన్ శాంతి బహుమతి పొందారు. 1973 ఏప్రిల్ 8న కన్నుమూశారు.

మధురై మణి అయ్యర్ (జయంతి)



కర్ణాటక సంగీత గాయకుడిగా రాణించిన మధురై మణి అయ్యర్ 1912 అక్టోబరు 25న తమిళనాడు రాష్ట్రం మదురైలో జన్మించారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, జీఎన్ బాలసుబ్రమణియమ్‌లతో కలసి 'సంగీతత్రయం'గా కొనసాగారు. రాగ ఆలాపనలో, స్వరాలలో తనదైనశైలితో ఆకట్టుకున్నారు. సంగీత కళానిధి, ప్రెసిడెంట్స్ అవార్డు, గాన కళాధరర్, ఇసై పెరారిజ్ఞార్ తదితర పురస్కారాలు పొందారు. 1968 జూన్ 8న కన్నుమూశారు. నేటికీ ఆయన సంగీతం శ్రోతలను అలరిస్తోంది.

కేటి పెర్రి (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన గాయని, గేయ రచయిత కేటి పెర్రి 1984 అక్టోబరు 25న జన్మించారు. బుల్లి తెరపై సంగీత కార్య క్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. 'అమెరికన్ ఐడల్' కార్యక్రమంతో పేరొందారు. 18 మిలియన్ ఆల్బమ్స్, ప్రపంచవ్యాప్తంగా 125 మిలియన్ సింగిల్స్ అమ్ముడయ్యాయి. 'ఆల్‌టైం పాప్‌సాంగ్ ఆర్టిస్ట్' జాబితాలో 4వ ర్యాంకులో నిలిచారు. నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డుల తోపాటు పలు అవార్డులు పొందారు. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ బాధ్యతలు చేపట్టినవేళ 'సెలబ్రేటింగ్ అమెరికా' కార్యక్రమంలో పాల్గొన్నారు. 350 మిలియన్ డాలర్లతో ఫోర్బ్స్ 2024లో ప్రకటించిన 'అమెరికాస్ రిచెస్ట్ సెల్ఫ్ మేడ్ ఉమెన్'లలో ఒకరిగా నిలిచారు.

27న టీడీపీ ఆత్మీయ సమావేశం




పోస్టర్‌లు విడుదల చేస్తున్న టీడీపీ ఫోరం ప్రతినిధులు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న ఆత్మీయ సమావేశం నిర్వహిస్తోంది. మారతహళ్ళిలోని కృష్ణ సమ్మిట్ లో ఆదివారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు విచ్చేయనున్నారని తెలుగు దేశం అభిమానులు విచ్చేసి విజయవంతం చేయాలని ఫోరం ప్రతినిధులు తెలిపారు. నగరంలో గురువారం ఇందుకు సంబంధించి ప్రత్యేక పోస్టర్‌లను విడుదల చేశారు. ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరబత్తు రాజశేఖర్ విచ్చేయనున్నారని తెలిపారు. బెంగళూరులో ఉంటున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రులు, అభిమానులు, కార్యకర్తలు విచ్చేయాలని కోరారు.

ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి లైన్ క్లియర్..!

● ఎంపీ కుమార్ నాయక్



రాయచూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర సమీపం యరమరస్ వద్ద నిర్మించతలపెట్టిన ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్‌కు ఆమోదం తెలిపిందని ఎంపీ జీ కుమార్ నాయక్ అన్నారు. గురువారం నగరంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న ఎయిర్ పోర్ట్ నిర్మాణం త్వరలోనే కార్యరూపం దాల్చనుందన్నారు. ఇందుకు సంబంధించి గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి పొందడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేసిందన్నారు. విమానయాన నిర్మాణం కోసం జిల్లాకు చెందిన చిన్ననీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్ భోసరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటిల్‌తో పాటు మంత్రి ఎంబీ పాటిల్ తీవ్రంగా శ్రమిస్తున్నట్లు వివరించారు. పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. పనుల టెండర్‌కు సంబంధించి ఎలాంటి వివాదాలకు తావు లేదని పనులను వేగవంతంగా చేపట్టేందుకు కాంట్రాక్టర్‌లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పై ఆరోపణలు వస్తున్న మూడ వివాదానికి సంబంధించి లోకాయుక్తకు తాము అన్ని వివరాలను వెల్లడించినట్లు కుమార్ నాయక్ తెలిపారు.

పర్యావరణ అనుకూల నిర్మాణాలు రావాలి

» నవంబరు 14 నుంచి సదస్సు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణకు అనుకూలంగా నిర్మాణాలు జరుపుకోవాలని తద్వారా ప్రకృతిలో లభించే స్వచ్ఛమైన గాలిని పొందేందుకు వీలుంటుందని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ బెంగళూరు విభాగం అధ్యక్షులు చంద్రశేఖర్ హరిహరన్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నవంబరు 14 నుంచి మూడు రోజుల పాటు 22 గ్రీన్‌బిల్డింగ్ కాంగ్రెస్ సదస్సు జరుగుతుందని ప్రకటించారు. గురువారం నగరంలో సదస్సుకు సంబంధించిన లోగోను లాంఛనంగా ఆవిష్కరించారు. బెంగళూరు విభాగం అధ్యక్షుడు, ఆల్ట్రాటెక్ ఫౌండేషన్ ట్రస్టీ చంద్రశేఖర్ హరిహరన్ మాట్లాడుతూ దేశంలో పర్యావరణ నిర్మాణాలకు గ్రీన్‌బిల్డింగ్ కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందన్నారు. ప్రస్తుతం 12 బిలియన్‌ల చదరపు అడుగుల నిర్మాణాలు సాధ్యమైనట్లు తెలిపారు. మరో 2500 బిలియన్‌ల నిర్మాణాలకు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. కర్ణాటకలోని గ్రీన్‌బిల్డింగ్ నిర్మాణాలలో 8-9 శాతం బెంగళూరులోనే ఉన్నాయన్నారు. ఆసుపత్రులు, ఆఫీసులు, నివాసాల నిర్మాణాల వేళ గ్రీన్‌బిల్డింగ్ విధానాలు పాటిస్తే 15-20శాతం అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుదని అయితే విద్యుత్, నీటి ఆదాతో పాటు ఆరోగ్యానికి ఆహ్లాదకరానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఐజీబీసీ సహ అధ్యక్షులు, అర్బన్ ఫ్రేం డైరెక్టర్ అనూప్ నాయక్ మాట్లాడుతూ యువ ఇంజనీర్‌లు, ఆర్కిటెక్చర్‌లు గ్రీన్‌బిల్డింగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ)కు అనుబంధమైన గ్రీన్ బిజినెస్ సెంటర్ ఈడీ కేఎస్ వెంకటగిరితో పాటు పలు సంస్థల ప్రతినిధులు భాగస్వాములయ్యారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ సదస్సుకు దేశంలోని ప్రముఖ పర్యావరణ నిపుణులు, వివిధ నిర్మాణ కంపెనీలతో పాటు ఆర్కిటెక్చర్‌లు పాల్గొంటారన్నారు.



సదస్సు వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

పిల్లల ప్రతిభను ప్రోత్సహించాలి



యక్షగాన కళాబృందాల విజేతకు అభినందన

బంగారపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా తమలో దాగియున్న విభిన్నమైన జ్ఞానం, నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు చాటేందుకు ప్రతిభాకారంజి ఉత్తమ వేదిక అని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పీయూ కళాశాల ఆవరణలో 2024-25 సంవత్సరానికి తాలూకా స్థాయి ప్రతిభా పోటీలను గురువారం ప్రారంభించి ప్రసంగించారు. విద్యతోపాటు పాఠ్యేతర అంశాలో ఆసక్తిగా పాల్గొనాలన్నారు. అభినయం, సంగీతం, నాటకం ఇలా వివిధ అంశాలలో తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిభా పోటీలు దోహదపడతాయన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల కూడా దృష్టి సారించాలన్నారు. తాలూకాలో పిల్లల ప్రతిభకు కొరతలేదన్నారు. అయితే వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠశాల స్థాయిలోనే ప్రతిభను గుర్తించి ప్రక్రియ సాగాలన్నారు. జిల్లాస్థాయికి ఎంపికయ్యే విద్యార్థుల ఖర్చును తానే భరిస్తానన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల వివిధ వేషధారణ ఆకట్టుకుంది. ప్రత్యేకించి దక్షిణకన్నడలో ప్రసిద్ధి చెందిన యక్షగాన కళాబృందాల ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, సభ్యుడు ప్రశాంత్, పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ, బీఈఓ గురుమూర్తి, సమన్వయ అధికారి శశికళ, అప్పయ్యగౌడ, సుజాతా, కాంతరాజ్, ఎల్ రామకృష్ణప్ప, సుబ్రమణి, శంకరప్ప, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్షపీడిత ప్రాంతాల పరిశీలన

» గ్రామాలలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పర్యటన

శిడ్లఘట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వర్షపీడిత ప్రాంతాల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పూర్ణిమా పరిశీలించారు. కొత్తనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గోరమడగు గ్రామంలో వర్షంతో దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల ఇళ్లకు, పంటలకు నష్టం వాటిల్లింది. తొలుత లోతట్టు ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధితులకు పరిహారం అందేలా చేస్తామని భరోసా ఇచ్చారు. పూర్తిగా దెబ్బతిన్న ఇంటిని పరిశీలించి వృద్ధురాలిని మరో చోటుకు మార్పు చేసి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇల్లు దాదాపు 80శాతం దెబ్బతిందని ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించి పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అలాగే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, వితంతు పింఛనుకు పరిశీలన చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విలేజ్ అకౌంటెంట్ రేవణ్ణ సిద్ధప్ప, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు పార్వతమ్మ శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



వృద్ధురాలిని పరామర్శిస్తున్న తహసీల్దార్

లోతట్టు ప్రాంతాలలో అదే పరిస్థితి...



బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో లోతట్టు ప్రాంతాలలో పరిస్థితి మార్పు రాలేదు. ఇంకా పలు లే అవుట్‌లలో రబ్బర్ బోట్‌లు, చెక్కలతో సంచరించాల్సిన పరిస్థితి నెలకొంది. గురువారం వర్షం కురవనప్పటికీ ఇంతవరకు కురిసిన వర్షం ప్రభావం ఇంకా వీడలేదు. కేంద్రీయవిహార్, సాయి లే అవుట్ తదితర ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

సాయి లే అవుట్‌లో బాధితులు

'కార్నియా సమస్యతోనే అంధత్వం'

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అంధత్వానికి కార్నియా సమస్యలే ప్రధాన కారణమని అగర్వాల్ ఆసుపత్రి కార్నియా రిఫ్రాక్టివ్ సర్జన్ సంజనావత్స అభిప్రాయపడ్డారు. గురువారం వర్చువల్‌గా సంజనా మీడియాతో మాట్లాడుతూ ఏటా దేశంలో 20-25వేలమందికి కార్నియా సమస్యలు వస్తున్నాయన్నారు. దేశంలోనే అంధత్వంలో 7.5 శాతం ఇదే కారణంగా ఉందన్నారు. కంటికి సంబంధించిన జబ్బులపట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సలహాలు పాటించాలన్నారు. కెరటైటిస్ సాధారణంగా కళ్లు ఎర్రబడడం ఇతరత్రా చిన్నసమస్యలతో ప్రారంభమవుతాయని, నిర్లక్ష్యం చేస్తే దృష్టి లోపానికి కారణమవుతుందన్నారు. క్యాటరాక్ట్ సర్జన్ డాక్టర్ స్మిత్ ఒవారియా మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. దేశంలో కార్నియా సమస్యల పరిష్కారానికి మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. కంటి ఆసుపత్రులు ప్రతిచోటా అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐక్యతతో కృషి చేస్తే జిల్లాలో అద్భుత ప్రగతి

రాయచూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఐక్యతతో పట్టుదలతో శ్రమిస్తే జిల్లాలో అద్భుత ప్రగతిని సాధించగలమని లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్ తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం లోకసభ సభ్యుడు కుమార్ నాయక్, నగరానికి చెందిన ఎమ్మెల్సీ ఎ.వసంత్ కుమార్‌లను డీసీసీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు ఐఏఎస్ అధికారిగా ఫైళ్లకే పరిమితమైన తాను ప్రజా జీవితంలోకి రావడం కొత్త అనుభవమేనని అందరి సహకారంతో శక్తికిమించి శ్రమించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. జిల్లాలో సాగునీటి సౌకర్యం విస్తృతంగా ఉండడంతో పాటు సహజ సిద్ధమైన వనరులు అనేకం ఉన్నాయని వాటి ఆధారంగా జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం అందరం కృషి చేద్దామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ వసంత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తగా తనకు ఈ గుర్తింపు లభించిందన్నారు. ఇందుకు తన రాజకీయ ఎదుగుదలకు అనేక మంది నాయకులు, మంత్రులు, కార్యకర్తలు సహకరించారని అందరికి కృతజ్ఞతలు తెలిపారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కుమార్ నాయక్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రాయచూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి తాలూకా గుడదూరు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరీశ్(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి శివరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. బస్సులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా వారిని సింధనూరు తాలూకా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని బళగానూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ స్థలం.. ప్రైవేట్ కళాశాల పరం

● పాత మున్సిపల్ కళాశాలకు 97ఏళ్లు..!

● నిర్వహణ లోపం... ఆకతాయిలకు స్థావరం...

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వడ్డించేవాడు మనవాడైతే... ఎంతతింటే ఏముందిలే అన్న చందానా... నాయకుల అత్యుత్సాహం, అధికారుల ఆదేశాలతో పాతమున్సిపల్ కళాశాల మైదానం ప్రైవేట్ కళాశాల పరమైంది. పేద విద్యార్థులకు చదువునే ప్రభుత్వ పాతమున్సిపల్ కళాశాల పట్ల నాయకులు నిర్లక్ష్యం వహించడంతో కళాశాల మైదానం నిర్వహణ లేకపోవంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి అయితే చాలు మందుబాబులు మైదానంలో మందు తాగుతూ ఎక్కడపడితే అక్కడ ఖాళీ బాటిళ్లను విసిరివేస్తున్నారు. రోడ్డు అభివృద్ధి పేరుతో కళాశాలకు ఉన్న ప్రహరీ కూల్చగా... దాని స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న ప్రహరీ పనులు పూర్తికాక పోవడంతో ఆకతాయిల రాక పోకలు నిత్యకృత్యమయ్యాయి. దీంతోపాటు రోడ్డుకు సంబంధించిన మెటీరియల్ ఇదే మైదానంలో వేయడంతో మైదానం అంతా అస్తవ్యస్తంగా మారింది. సాధారంగా పనులు చేపట్టిన కాంట్రాక్టరు మెటీరియల్ వేసే సమయంలో ఆ స్థలానికి సంబంధించి కళాశాల ప్రిన్సిపాల్ అనుమతి తప్పనిసరి. అయితే ప్రస్తుతం అనుమతి మాట అనే విషయం బళ్లారి నగరంలో ఎక్కడా చెల్లుబాటు కావడం లేదు. ప్రస్తుతం మున్సిపల్ కళాశాల బెటర్‌మెంట్ కమిటీ స్థానిక ఎమ్మెల్యే కావడంతో కళాశాలలో ఎలాంటి పని చేయాలన్నా, నిర్ణయం తీసుకోవాలన్నా అధికారుల మాటకంటే ఎమ్మెల్యే మాటే ఇక్కడ చెల్లుబాటు అవుతుండడం విశేషం. సాధానంగా ఇదే స్థలంలో కొన్నేళ్లుగా ఏటా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడంలో కళాశాలకు నిధులు సమకూరేవి. అయితే కళాశాల మైదానం ప్రైవేట్ కళాశాల పరం కావడంతో ఉన్న స్థలాన్ని నిర్వహణ చేసుకోవడానికి నిధులు లేకపోవడంతో సంబంధిత అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఉచితంగా స్థానిక ఎమ్మెల్యే సిఫార్సుతో నెలల తరబడి మెటీరియల్ స్టాక్‌కు మున్సిపల్ స్థలాన్ని ఉపయోగించుకున్నారు తప్ప కళాశాల అభివృద్ధికి ఉపయోగపడేందుకు తమవంతు ఒక్కపైసా చెల్లించకపోవడం విశేషం. ఏమైనా అడిగితే ఎమ్మెల్యే చెప్పారు అనడంతో కళాశాల అధికారులు నోరు మెదపలేకపోతున్నారు.



మున్సిపల్ కళాశాల మైదానంలో దర్శనమిస్తున్న బీరు బాటిళ్లు



1927లో స్థాపించిన మున్సిపల్ కళాశాల బోర్డు

దేశసేవ చేయడం అభినందనీయం



అగ్నివీర్‌లుగా ఎంపికైనవారికి సన్మానం

బంగారపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశసేవ చేయడం పుణ్యమైన పని మన కళాశాల యువకులు ఎంతోమంది దేశభక్తితో సేవాభావంతో మిలిటరీలో పనిచేస్తున్నారని సీనియర్ ప్రొఫెసర్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కేసీ రెడ్డి కళాశాల విద్యార్థులు ఆర్మీకి ఐదుగురు విద్యార్థులు అగ్నివీర్‌గా ఎంపిక కావడంపై ఎన్‌సీసీ, ఎంసీసీ విద్యార్థులు గురువారం చేసిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. జై జవాన్, జై కిసాన్ అంటూ రైతులు, సైనికులు దేశానికి గొప్ప శక్తి అన్నారు. సైనికులు ఎండావాన లెక్కించకుండా సరిహద్దుల్లో శ్రమిస్తుంటే రైతు దేశానికి అన్నం అందిస్తున్నారన్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో దేశసేవ చేసేందుకు సైనిక వృత్తిని ఎన్నుకోవడం స్వాగతార్హమన్నారు. ఆర్మీకి ఎంపికైన భాను ప్రకాశ్, ముత్తురాజ్, శ్రీకాంత్, బాలు, చందులను ప్రత్యేకంగా అభినందించారు. వారికి ఆయురారోగ్యాలు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీకాంత్, మోనికా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సతీశ్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కలప ఉత్పత్తులలో నాణ్యతకే ప్రాధాన్యం

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కలప ఉత్పత్తులలో నాణ్యతకే ప్రాధాన్యత అని డ్యూరోప్లై ప్రొడక్షన్ విభాగం చైర్మన్ అభిషేక్ చిట్లాంగియా వెల్లడించారు. ఈమేరకు గురువారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. డ్యూరోప్లై ప్లై వుడ్, బ్లాక్ బోర్డ్‌లు, డోర్‌లతోపాటు అన్ని విధాలా కలప ఉత్పత్తులలో నాణ్యతలో రాజీ లేదన్నారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల నమ్మకాన్ని దశాబ్దాలకాలంగా కొనసాగిస్తున్నామన్నారు. ప్రధాన నగరాలనుంచి అన్ని మారుమూల ప్రాంతాలకు తమ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. పర్యావరణం, వినియోగదారులకు తమ ఉత్పత్తులు సుదీర్ఘకాలం మన్నిక ఉండేలా అందిస్తున్నామన్నారు. కాలిఫోర్నియా ఏర్ రీసోర్సెస్‌బోర్డ్ నిబంధనల ప్రకారం విశ్వవ్యాప్తంగా ప్రామాణికతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

సమాజ సేవకుడు ఎన్ఎస్ రవి కన్నుమూత



ఎన్ఎస్ రవి (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవకుడిగా రాణించిన భారతీనగర్ రెసిడెన్షియల్ ఫోరం అధ్యక్షులుగా గుర్తింపు పొందిన ఎన్ఎస్ రవి కన్నుమూశారు. కాక్స్ టౌన్ రవిగా ఆయన సుపరిచితులు. భారతీ నగర్ ప్రాంతంలో నివసించే పేదలకు, చిన్నారులకు నిరంతరంగా సాయం చేసేవారు. సంక్రాంతి, క్రిస్మస్ లాంటి పండుగలు ఏవైనా స్థానిక చిన్నారులకు బహుమతులు ఇచ్చేవారు. పేదలకు అండగా ఉండేవారు. దశాబ్దాలకాలంగా సామాజిక సేవలోనే గుర్తింపు పొందిన ఎన్ఎస్ రవి మృతి పట్ల సినిమా నటులు తార అనురాధతోపాటు పలువురు విచారం వ్యక్తం చేశారు. బుధవారం గుండెపోటుకు గురై ఆయన మృతి చెందాడు.

ప్రత్యేక పాల సమాఖ్యకు హైకోర్టు తీర్పుపై హర్షం - ఎంపీ సుధాకర్



ఎంపీ డాక్టర్ సుధాకర్

చిక్కబళ్ళాపుర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత బీజేపీ అవధిలో కోచిముల్ విభజన చేసి చిక్కబళ్ళాపుర జిల్లాకు ప్రత్యేక పాల సమాఖ్యకై ఉద్దేశించిన ఉత్తర్వులకు జీవం పోస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షంగా ఉందని చిక్కబళ్ళాపుర ఎంపీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. ఇది కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లా రైతుల పోరాటానికి విజయమన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలనాపరంగా చిక్కబళ్ళాపుర జిల్లా పాడిరైతులకు పాలసమాఖ్య ఏర్పాటు కావాలని అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాజకీయ ద్వేషాలతో బీజేపీ పాలనలోని ఉత్తర్వులను రద్దు చేసిందన్నారు. 17 నెలల తర్వాత హైకోర్టు తీర్పుతో జిల్లా పాడిరైతులకు న్యాయం లభించిందన్నారు. కోర్టు తీర్పు కాంగ్రెస్ నాయకులకు బుద్ధిచెప్పినట్టయ్యిందన్నారు. ఇకనైనా జిల్లా కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయకుండా ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. ఇక పాల సమాఖ్యను విభజించి చిక్క బళ్ళాపుర జిల్లా సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.


స్కౌట్స్‌తో మంచి అలవాట్లు సాధ్యం



స్కౌట్స్ అండ్ గైడ్స్ పదాధికారులతో విశ్వసంతోష గురూజీ

బెంగళూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా క్రమశిక్షణ, ఇతరులకు సాయం చేసేటటువంటి మంచి అలవాట్లు సాధ్యమని ఆయురాశ్రమకు చెందిన విద్యావాచస్పతి డాక్టర్ విశ్వసంతోష గురూజీ అభిప్రాయపడ్డారు. కర్ణాటక హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉత్తర జిల్లా రాజ్య పురస్కార కార్యక్రమాన్ని గురూజీ లాంఛనంగా ప్రారంభించారు. నేషనల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం కేప్టెన్ కేఎస్ చౌహాన్, న్యూ మంజుళ పబ్లిక్‌స్కూల్ సంస్థాపకులు ఎంఎస్ భైరేగౌడ, బెంగళూరు ఉత్తర జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ కేహెచ్ ధనంజయ, కేపీ యువరాజ్, డాక్టర్ హర్షవర్ధన్, ప్రీతి మంజునాథ్, అనుపమ వెంకటేశ్, డాక్టర్ కే వేణుగోపాల్, రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగానికి చెందిన రశ్మి వెంకటేశ్, మహేశ్ బీఎం తదితరులు పాల్గొన్నారు.





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.94	1,610.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	97,751	508
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	96,487	9,790
నీటి నిల్వ (టీఎంసీలు)	101.54	38.64

హులిగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.12 కోట్లు



హుండీ లెక్కింపులో నిమగ్నమైన ఆలయ సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా మునిరాబాద్ తాలూకాలో వెలసిన హులిగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.12 కోట్లు వచ్చినట్లు ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రకాష్ తెలిపారు. బుధవారం రాత్రి వరకు నిర్వహించిన హుండీ లెక్కింపులో 55 రోజులకు గాను రూ 1.12కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. హుండిలో 134 గ్రాముల బంగారు, 10 కిలోల వెండి అమ్మవారికి సమర్పించినట్లు వివరించారు. ఆగస్టు 28వ తేదీన హుండీ లెక్కించగా, తిరిగి అక్టోబరు 22వ తేదీన ప్రారంభమైన లెక్కింపు 23వ తేదీ రాత్రి వరకు కొనసాగినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం, పున్నమి రోజుల్లో లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం సర్వసాధారణమన్నారు.

ఒక్కటైన 23 జంటలు



సామూహిక వివాహాల్లో ఒక్కటైన జంటలు

సిరుగుప్ప, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉచిత సామూహిక వివాహాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర అన్నారు. గురువారం సిరుగుప్పలోని వినాయకుడి ఆశ్రమంలో శివశక్తి కళ్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీశైలం జగద్గురువులు చెన్న సిద్దరామ పండితారాధ్యులు, ఉజ్జయిని మఠం రాజదేశి శివాచార్యులు సాన్నిధ్యం వహించారు. ఈ సందర్భంగా 23 జంటలు ఒక్కటయ్యాయి. రూ.7 కోట్ల వ్యయంతో కళ్యాణమండపాన్ని నిర్మించారు. కార్యక్రమంలో మఠం ప్రముఖులు బసవరాజప్ప, చంద్రశేఖరయ్య, బసనగౌడ, మాజీ ఎంపీ కరడి సంగన్న, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప పాల్గొన్నారు.

దివ్యాంగులను గౌరవిద్దాం: ఎమ్మెల్సీ



రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సతీశ్

బళ్లారి సిటీ,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను గరవిద్దామని ఎమ్మెల్సీ సతీశ్ అన్నారు. బెంగళూరులో దివ్యాంగుల కోసం రెసిడెన్షియల్ పాఠశాల అశ్విని అంగడి ట్రస్టు 'బెళకు అకాడమీ'ని ఎమ్మెల్సీ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను గౌరవించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళగా అశ్విని అంగడి సాధించిన ఘనత అభినందనీయమన్నారు. ఈ విజయం చాలా మందికి స్ఫూర్తి ఇస్తుందని, వారిని ప్రోత్సహించి గౌరవించాలని ఆకాంక్షించారు. ఎస్ఈజీ ఆటోమోటివ్ ఇండియా ప్రైవేటు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మన కష్టానికి భగవంతుడి ఆశీస్సులు తోడైతే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రైవేట్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో దివ్యాంగులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావచ్చన్నారు. అశ్విని అంగడి సాధించిన ఘనత ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందని యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్ అన్నారు. కార్యక్రమంలో శాంతముని దేశికేంద్ర శివాచార్య స్వామీజీ, జర్నలిస్ట్ శశిధర మేటీ దర్శకుడు నటరాజు, సాహితీ నాగతిరమేశ్ వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ఇదీ సంగతి..!

- ప్రమాదకరంగా.. భారీ కటౌట్
- కళ్లుమూసుకున్న పాలికె అధికారులు
- ఇందిరా క్యాంటిన్‌కు దారిలేక వెనుదిరుగుతున్న ప్రజలు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణలో భాగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని, కార్పొరేషన్ అధికారులు అందుకు అనుమతి ఇవ్వరాదని నిబంధనలు ఉన్నా... నగరంలో మాత్రం అమలు కావడం లేదని సీనియర్ సిటిజన్లు విమర్శిస్తున్నారు. ఇందుకు నిదర్శనం నగరంలోని మోతి సర్కిల్ వద్ద వంద అడుగుల మేర ప్రమాదస్థాయిలో ఏర్పాటు చేసిన కటౌట్. ఈ మధ్యనే నగరంలోని ప్రధాన సర్కిళ్లలో ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశారంటూ జేసీబీతో తొలగించిన కార్పొరేషన్ అధికారులు, అనుమతి



ఫ్లెక్సీలతో నిండిపోయిన సంగం సర్కిల్



మోతి సర్కిల్‌లో ఏర్పాటైన భారీ కటౌట్

లేకుండా, నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదస్థాయిలో కటౌట్ ఏర్పాటు చేయడం వెనుక ఎవరి సిఫార్సుతో నిర్మించారనదేది ప్రశ్నార్థకం. ఇదే విషయంపై అనుమతులు లేకుండా ఏమిటీ నిర్మాణాలు అనే శీర్షికతో కథనంతో 19వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అయినా.. ఈ విషయంలో జిల్లా పాలక మండలి, కార్పొరేషన్ అధికారుల్లో కదిలిక లేకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. దీనిపై కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్‌ను వివరణ కోరగా కటౌట్ నిర్మాణానికి ఎవరికీ అనుమి ఇవ్వలేదని, అనుమతి ఎవరూ కోరలేదనే సమాధానం చెబుతున్నారు. మరి వంద అడుగుల పైబడిన కటౌట్ ఏర్పాటుకు అనుమతి ఎవరిచ్చారనేది. నగర ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ఫ్లెక్సీ ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతి ఇచ్చినా అధికారులదే తప్పు అవుతుంది కావునా అవి కనిపించినా... కళ్లుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు కార్పొరేషన్ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా మోతి సర్కిల్‌లో ఉన్న ఇందిరా క్యాంటిన్ ముందు కటౌట్ ఏర్పాటు చేయగా ఆ ప్రాంతం అంతా మూసివేయడంతో పేద ప్రజలు దారిలేక ఆకలితోనే వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మనస్పర్థలు వీడి... ఐక్యంగా ముందుకు సాగాలి

కంప్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మనస్పర్థలు వీడి ఐక్యతతో ముందుకు సాగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని వాల్మీకి సమాజం పీఠాధీశ్వరులు రాజనళ్లి ప్రసన్నానందపురి స్వాములు అన్నారు. గురువారం కంప్లి పట్టణంలో వాల్మీకి సమాజం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. అలాగే నూతనంగా నిర్మించిన వాల్మీకి భవనాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఉదయం వాల్మీకి సర్కిల్‌లో పూజలు చేశారు. ఉద్భవ గణపతి ఆలయం వద్ద పూజలు నిర్వహించి ప్రసన్ననందా పురి స్వామిని ముత్తయిదువులు కలశాలతో భాజాభజంత్రీల మధ్య రాజ్‌కుమార్ మెయిన్ రోడ్డు మీదుగా భవనం వరకు ఊరేగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని సమాజాలతో పాటు వాల్మీకి సమాజం కూడా ఆర్థిక పరంగా శిక్షణ, రాజకీయపరంగా ముందుకు రావాలన్నారు. అలాగే ప్రతి ఇంట పిల్లలకు విద్యాభ్యాసం అందించాలన్నారు. ప్రభుత్వ సదుపాయాల ద్వారా కూడా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మెరుగుపడాలన్నారు. అనంతరం పలువురు నాయకులకు, ఎమ్మెల్యేకు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్ శివపుర, పరిశిష్ట జాతి జిల్లా అధికారి దివాకర్, తాలుకా అధికారి గాదెలింగప్ప, ముఖ్య అధికారి దుర్గన్న, వాల్మీకి సమాజం అధ్యక్షులు నారాయణప్ప, హేమయ్యస్వామి, ఆంజనేయ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, లక్ష్మణ, కగ్గల్లు వీరేష్, ఈరన్న, అంబన్న, రామాంజినేయులు సుదర్శన్‌రెడ్డి, గోవిందప్ప పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించిన ప్రారంభిస్తున్న ప్రసన్ననందాపురి స్వామి

వైభవంగా రథోత్సవం



సుగ్గి మల్లేశ్వర స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

కంప్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా హగరి బొమ్మనళ్లి తాలుకా పరిధిలోని బెట్టదసుగ్గి మల్లేశ్వరస్వామి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఈ రథోత్సవం నిర్వహిస్తామని భక్తులు తెలిపారు. స్వామి వారికి పూజలు నిర్వహిస్తే పుష్కలంగా పంటలు, ఆరోగ్యంగా ఉంటారన్నారు. సాయంత్రం పూలు, పండ్లు, కొబ్బరికాయలతో స్వామివారి రథానికి విసురుతూ భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

పశువులకు టీకాలు వేయించండి



పశువులకు టీకాలు వేయిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కంప్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు పశువులకు టీకాలు వేయించి వాటి సంరక్షణ చేపట్టాలని కూడ్లిగి ఎమ్మెల్యే శ్రీనివాస్ సూచించారు. గురువారం నరసింహగిరి గ్రామంలోని పశువుల ఆస్పత్రిలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు పశువుల కాపరులు ఎంతో మంది వాటిని నమ్మి జీవనం సాగిస్తున్నారన్నారు. వాటికి వ్యాధులు వస్తే ఇబ్బందులు పడతారన్నారు. ముందుజాగ్రత్తగా టీకాలు వేయించి పశువులను ఆరోగ్యంగా వుంచుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు



కురుమగనహళ్లి వద్ద తెగిన చెరువు



కోర్టు వద్ద నిలిచిన నీరు.. ఇబ్బంది పడుతున్న అధికారులు

కంప్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విజయనగర జిల్లాలో ఎక్కడ చూసినా నీరే కనిపిస్తున్నాయి. గురవారం కురిసిన భారీ వర్షానికి కురిమగనళ్లి గ్రామంలో చెరువు తెగి పొలాల్లోకి నీరు ప్రవహించాయి. అలాగే అడగళిలో కురిసిన వర్షానికి కంచికేరి, బెండిగెర రోడ్డులో అండర్‌పాస్ బ్రిడ్జి కింద నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం, పురసభ, కళాశాల తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయాయి. కూడ్లిగి ఖానా హోసళ్లి, గుడేకోట రోడ్లపై నీరు ప్రవహించడంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కానాహోసళ్లి- గుడేకోట రోడ్డుపై పారుతున్న నీరు

సండూరు ఉప సమరం

సండూరు ప్రజలు కాంగ్రెస్ వైపే

- మంత్రుల విశ్వాసం



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు

బళ్లారి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణను ప్రజలు గెలిపిస్తారని మంత్రులు సంతోష్ లాడ్, జమీర్ అహ్మద్, మాజీ మంత్రి నాగేంద్ర విశ్వాసం వ్యక్తం చేశారు. నామినేషన్ తరువాత వారు అక్కడ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, ఎన్నికల ముందు పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను అందిస్తుని, ఇచ్చిన మాట ఎక్కడా తప్పలేదన్నారు. అలాగే సండూరు ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న మూడు స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సండూరు ఎప్పటికీ కాంగ్రెస్‌కు పెట్టినంకోట అన్నారు. ఇక్కడి ప్రజలు శాంతిని, అభివృద్దిని కోరుకుంటారని అందుకే స్థానికంగా ఉండే తుకారాం సతీమణి అన్నపూర్ణకు ఓటు వేసి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ మాట్లాడుతూ పార్టీ ఖచ్చితంగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఉప ఎన్నికలపై బీజేపీ వ్యూహం

- గాలి జనార్దన్‌రెడ్డి ఇంట్లో నాయకుల మంతనాలు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను సన్మానించిన బళ్లారి నాయకులు

బళ్లారి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికపై బీజేపీ నాయకులు బళ్లారిలో గాలి జనార్దన్‌రెడ్డి ఇల్లు వేదికగా రాజకీయ వ్యూహం పన్నుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, ఏపీ బీజేపీ నాయకుడు కాపురామచంద్రారెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, ఇతర కీలక నాయకులు గురువారం జనార్దన్‌రెడ్డి ఇంట్లో అభ్యర్థి బంగారు హనుమంతతో కలిసి చర్చలు జరిపారు. రాష్ట్ర రాజకీయాలకు బళ్లారి కేంద్ర బిందువు. ఒకప్పుడు గాలి జనార్దన్‌రెడ్డి వ్యూహంతోనే బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం కూడా ఇదే వ్యూహం వేస్తున్నారని సమాచారం. రాష్ట్ర నాయకుడు బళ్లారిలో వివిధ సంఘాల నాయకులతో కలవడం, అలాగే కొందరిని గాలి జనార్దన్‌రెడ్డితో కలవడం, ఆయన ఇంటికి రప్పించుకోవడం చేస్తున్నారు. ప్రధానంగా సండూరులో నాయకులు ఎక్కువగా సభలు, సమావేశాలు చేస్తే ఆ ఖర్చులు అభ్యర్థులపై పడతాయనే కారణంతో బళ్లారిలో గాలి జనార్దన్‌రెడ్డి ఇంటిని వేదికగా మార్చారనే చర్చ సాగుతోంది. రాజకీయ ఎత్తులు బాగా తెలిసిన గాలి జనార్దన్‌రెడ్డి, ఆయనకు అత్యంత సన్నిహితుడుగానూ లీగల్ అడ్వైజర్‌గా ఉన్న కాపు రామచంద్రారెడ్డి కూడా జతకావడం రాజకీయం మరింత ఆసక్తికరంగా మారింది. ఎలాగైనా ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కావాల్సిన అన్ని ఎత్తులూ వేస్తున్నారని సమాచారం.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై 8 కేసులు

బళ్లారి సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సండూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధంగా అక్రమంగా రవాణా చేస్తున్న 2616.93లీటర్ల(రూ.7,76,648విలువైన)మద్యాన్ని సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన సీజ్ చేసి 8 కేసులు నమోదు చేశారు.



ప్రశాంత్‌కుమార్ మిశ్రా

2615.49 టీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ పోలీసు అధికారులు, 1.41 లీటర్ల మద్యాన్ని పోలీసు శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సండూరు అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు ఇప్పటికే వివిధ బృందాలను ఏర్పాటు చేసి చురుగ్గా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 1 ఎస్ఎస్‌టీ టీం, 4 ఎక్సైజ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

బీజేపీ అభ్యర్థి వద్ద 2.5 కిలోల బంగారం

- ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు ప్రకటించిన బంగారు హనుమంత



బళ్లారి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సండూరు నియోజక వర్గ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బంగారు హనుమంత రూ.కోట్లకు పడగలెత్తారు. ఆయన ఎన్నికల అధికారులకు చూపిన ఆస్తులు, అప్పులు, ఆభరణాలు, తదితర పూర్తి వివరాలు లెక్కలు వేస్తే రూ.కోట్లలోనే ఆస్తులు కలిగినట్లు అఫిడవిట్ ద్వారా తెలుస్తోంది. ఆయన వద్ద 2.5 కిలోల బంగారు ఆభరణాలు. 25 కిలోల వెండి ఉన్నట్లు తెలిపారు. హనుమంత సతీమణి రూపశ్రీతో 500 గ్రామల బంగారు నగలు ఉన్నాయని తెలిపారు. తండ్రి బంగారు సోమప్ప, తల్లి బంగారు హులిగమ్మల వద్ద కిలో బంగారు ఆభరణాలు, 15 కిలోల వెండి ఉన్నట్లు చూపారు. నగదు మాత్రం బ్యాంకులో రూ.5 లక్షలు ఉన్నట్లు చూపారు. మంగళూరులో రూ.1,07,38,000 విలువైన రిసార్ట్ ఉందని, ఒక స్టోన్ క్రషరు, పౌల్ట్రీ ఫారం ఉందని అఫిడవిట్‌లో చూపారు. ఆయన వార్షిక ఆదాయం రూ.7,58,64,019 భార్య వార్షిక ఆదాయం రూ.1,69,82,571 ఉంది. స్థిరాస్తి 54.11 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమంతా విరాళంగానే వచ్చినట్లు చూపారు. దీని విలువ రూ.4 కోట్లు ఉంటుందన్నారు. భార్య పేరుతో 11 భవనాలు ఉన్నాయి. తన పేరుపై సొంత కారు కూడా ఉన్నట్లు చూపారు.

ఎన్నికల పరిశీలకులుగా దివ్య అయ్యర్

బళ్లారి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సండూరు శాసనసభ ఉప ఎన్నికల పరిశీలకులుగా డాక్టర్ దివ్య ఎస్ అయ్యర్‌ను నియమించారు. ఎన్నికల సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, రాజకీయ పార్టీల కదలికలు తదితర వాటిపై ప్రత్యేక ఉంచనున్నట్లు ఆమె తెలిపారు ప్రజలు ఎవరైనా ఫిర్యాదులు చేయాలంటే 9141142756 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఇజ్రాయెల్ పౌరుడిని రక్షించిన స్థానికులు



వ్యక్తిని బయటకు తీసుకొస్తున్న స్థానికులు

గంగావతి రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని సణాపుర గ్రామం వద్ద బుధవారం నదిలో ఈతకు వెళ్లిన ఇజ్రాయెల్ దేశానికి చెందిన లేవి అమిత్ అనే వ్యక్తి కాలుజారి పడిపోయాడు. తన స్నేహితులతో హంపి, ఆనెగొంది ప్రాంతాల్లో పర్యటించి అనంతరం నదిలో స్నానం చేయడానికి వెళ్లిన యువకుడు ప్రమాదస్థాయిలో ఉన్న ప్రాంతానికి వెళ్లి మునిగిపోయాడు. గట్టుపైన ఉన్న స్థానికులు గమనించి అతడిని రక్షించి బయటకు తీసుకొచ్చి ప్రాణాలు కాపాడారు.

ఆర్టీసీ బస్సు బోల్తా... మహిళ మృతి

- 20 మందికి గాయాలు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా, హరపనహళ్ళి తాలూకా పరిధిలో గురువారం కేఎస్ఆర్టీసీ బస్సు బోల్తాపడిన ఘటనలో హనుమక్క(45) అనే మహిళ మృతి చెందగా మరో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో దావణగెర జిల్లా ఆసుపత్రికి తరలించారు. దావణగెర నుంచి హరపనహళ్ళి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. అరిసికెర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

పారిశ్రామికవేత్తలకు భారీగా రుణాలు

హోసూరు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలకు 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.3,508.67 కోట్ల వ్యాపార రుణం మంజూరైంది. ప్రస్తుత అక్టోబరు నెలలో 135 మంది లబ్ధిదారులకు రూ.73.68 కోట్ల ఉపాధి రుణాలు అందించినట్లు జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటైన సమావేశంలో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ (ఎంఎస్ఎంఈ), జిల్లా పారిశ్రామిక కేంద్రం, ప్రభుత్వ శాఖలు, జిల్లా బ్యాంకు, అన్ని బ్యాంకులు సంయుక్తంగా వ్యాపార, విద్యారుణమేళా నిర్వహించారు. గురువారం 19 మంది పారిశ్రామికవేత్తలకు రూ.12 కోట్ల 3 లక్షల విలువైన వర్క్‌లోన్ మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 20 మందికి కళాశాల విద్యార్థులకు రూ.1.20 కోట్ల విలువైన విద్యారుణాల చెక్కులను జారీ చేశారు. సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని సృష్టించ గత సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి, వృద్ధి అభివృద్దికి దోహదపడతాయి, తమిళనాడు ప్రభుత్వం, కృష్ణగిరి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక నివేదికలో రూ.5496.67 కోట్ల రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024-25 సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి ఈ లక్ష్యాన్ని సాధించేందుకు జిల్లాలోని పారిశ్రామిక కేంద్రాల్లో ఉపాధి రుణాలు అందించేలా సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. వార్షిక క్రెడిట్ లక్ష్యం ప్రకారం ఏప్రిల్ 1నుంచి సెప్టెంబరు దాకా ఎంఎస్ఎంఈలకు రూ.3508.67కోట్లు (83.83)శాతం వ్యాపారరుణంగా మంజూరైంది. అలాగే అక్టోబరు 1నుంచి 22వరకు 135 మంది లబ్ధిదారులకు అన్ని బ్యాంకుల నుంచి రూ.73.68 కోట్ల ఉపాధి రుణాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా పారిశ్రామిక కేంద్ర జనరల్ మేనేజర్ ప్రసన్న బాలమురుగన్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శరవణన్, తమిళనాడు ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ మోహన్, ఇండియన్ బ్యాంక్ కృష్ణగిరి బ్రాంచ్ ప్రిన్సిపల్ మేనేజర్ నిర్మిల్‌కుమార్ పఠాన్, అసిస్టెంట్ డైరెక్టర్ రామమూర్తి, జిల్లా అధ్యక్షుడు కార్తికేయ అన్ని బ్యాంకుల కో ఆర్డినేటర్లు, శాఖాధికారులు పాల్గొన్నారు.



రుణ సహాయం అందిస్తున్న కలెక్టర్ సరయు

బ్యాడరపల్లి పాఠశాలలో ఘనంగా కళోత్సవం

హోసూరు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో 1 నుంచి 12 తరగతుల విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహిస్తుంది. అదేవిధంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో సెప్టెంబరులో పాఠశాల స్థాయిల్లో విద్యార్థులకు కళోత్సవను నాలుగు విభాగాలుగా నిర్వహించారు. 1 నుంచి రెండో తరగతి వరకు, మూడు నుంచి ఐదో తరగతి వరకు, ఎనిమిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో గెలుపు పొందిన వారికి బహుమతులు అందించారు. 23, 24 తేదీలలో రెండు రోజుల పాటు కథలు చెప్పడం, రంగులు వేయడం, తిరుకురళ్ పోటీలు, భరత నాట్యం మొదలైన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. జూజూవాడి పాఠశాల ప్రదానోపాధ్యాయుడు ప్రకాశ్, పదరబ్ పాఠశాల ప్రదానోపాధ్యాయుడు నాగేశ్ అధ్యక్షత వహించారు. ప్రతి కార్యక్రమంలో గెలుపొంది ప్రథమ స్థానంల్లో నిలిచిన విద్యార్థులందరూ జిల్లాస్థాయిల్లో నిర్వహించే కళా ఉత్సవాల్లో పాల్గొనబోతున్నట్టు ప్రకటించారు.



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

నురగ ప్రభావంతో ట్రాఫిక్‌కు అంతరాయం

హోసూరు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కెలవరపల్లి డ్యాం సమీపాన 30 అడుగులకు పైగా రసాయనిక నురుగు పేరుకుపోయింది. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి తొలగించే కార్యాచరణ చేపట్టింది. భారీ వర్షం కారణంగా హోసూరు కెలవరపల్లి డ్యాంకు గురువారం ఉదయం 4,160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం నుంచి దక్షిణ పినాకిని నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అనకట్ట సమీపంల్లోని రసాయనిక నురుగుతో పేరుకుపోయింది. నురుగు ప్రభావంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో తట్టగాన పల్లి , నందిమంగళం, చిత్తన్నపల్లి మీదుగా బేరికై వెళ్లే మార్గంలో గ్రామస్తులు అవస్థలు పడ్డారు. పోలీసులు ఇరువైపులా బారికేడ్‌లు ఏర్పాటు చేసి బందోబస్తులో నిమగ్నమయ్యారు.



నురగను తొలగించే పనిలో అగ్నిమాపక సిబ్బంది